
సాక్షి ప్రకాశం

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



జెడ్పీ ఉద్యోగులతో బదిలీలాట

జెడ్పీ ఉద్యోగుల సాధారణ బదిలీల్లో గందరగోళం నెలకొంది. తాము చెప్పినవారికే పోస్టింగ్‌లు ఇవ్వాలంటూ అధికార పార్టీ నేతలు అధికారులను ఒత్తిడి చేస్తున్నారు. - 8లో..



నల్లమల ఘాట్‌లో ఉల్లిలారీ బోల్తా

నల్లమల ఘాట్ రోడ్డులో ఉల్లిపాయల లోడు లారీ బోల్తా పడింది. దీంతో గిద్దలూరు-నంద్యాల మార్గంలో 4 గంటలపైగా ట్రాఫిక్ స్తంభించింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
32.6/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్షకు అక్టోబరు 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ వీకే గీతాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల నుంచి ప్రభుత్వ లేదా ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ధ్రువపరిచి అప్‌లోడ్ చేయాలన్నారు. వీటితోపాటు 2022-23 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రవేశ పరీక్ష 2025 జనవరి 18న ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి తెలిపారు.

ఏఎంవీఐ రవినాయక్ బదిలీ

ఒంగోలు: అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్‌ను బదిలీచేస్తూ రవాణాశాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులో విధులు నిర్వహిస్తున్న రవినాయక్‌ను చీరాల ఏఎంవీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో పల్నాడు నుంచి ధర్మేంద్రను ఒంగోలుకు బదిలీ చేశారు.

28న ఎస్‌జీఎఫ్ అండర్ 14,17 క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాలబాలికల క్రీడాజట్ల ఎంపిక ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలు సింగరాయకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు, టేబుల్ టెన్నిస్ క్రీడాజట్ల ఎంపిక స్థానిక హైదరీక్లబ్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గలిగిన పీఈటీ, పీడీలు విద్యార్థులతో ఆన్‌లైన్ ఎంట్రీ చేసుకుని మాన్యువల్ ఎంట్రీఫారంతో వచ్చి ఎంపికలో పాల్గొనాలన్నారు. అండర్ 17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో నిర్వాహకులకు సమర్పించి క్రీడల్లో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు హ్యాండ్‌బాల్ జట్లకు సంబంధించి సెల్ నంబర్ 8096584584, టేబుల్ టెన్నిస్‌కు సంబంధించి 77308 83236 లను సంప్రదించవచ్చన్నారు.

రుచికరమైన భోజనం పెడితే కదా తింటారు

- ఉపాధ్యాయులతో డీఈఓ సుభద్ర



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

పొదిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని డీఈఓ సుభద్ర ఆదేశించారు. మంగళవారం ఆమె పొదిలి మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. భోజన సమయంలో కొంత మంది విద్యార్థులు కోడి గుడ్డు తినకపోవడాన్ని గమనించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులంతా పాఠశాలలో భోజనం చేయాలంటే రుచికరంగా పెట్టాలని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. రోజూ పిల్లలు కోడిగుడ్లు తినేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని, అవసరమైతే గుడ్లతో వివిధ రకాల కూరలు చేసి అందరూ తినే విధంగా చూడాలని ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలని చెప్పారు. ఆమె వెంట ఒంగోలు, కనిగిరి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారులు చంద్రమౌళీశ్వర్, సాహు సుబ్బారావు, ఎంఈఓ ఎం.శ్రీనివాసులు, సీఆర్పీలు ఉన్నారు.

తాంబూలం ఇచ్చాం.. తన్నుకు చావండి!

నామినేటెడ్ పదవుల కోసం ఆశలు పెట్టుకున్న అధికార కూటమి నేతలకు రిక్త హస్తమే ఎదురైంది. ఎప్పుడెప్పుడు పోస్టులు భర్తీ చేస్తారా అని ఆశగా ఎదురు చూసిన వారంతా తమ పరిస్థితి ఏమిటని ఆత్మ సాక్షిని ప్రశ్నించుకుంటున్నారు. పదవుల పంపకాలపై అదిగో.. ఇదిగో అంటూ ఆశావహులను ఊరడిస్తూ చంద్రబాబు తనదైన స్టైల్‌లో కాలయాపన చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు మంగళవారం నామినేటెడ్ పదవుల జాబితా విడుదలైంది. తమకు కచ్చితంగా పదవి దక్కుతుందని ఆశించిన నేతలకు నిరుత్సాహాన్ని మిగిల్చింది. నామినేటెడ్ పదవుల జాబితాలో జనసేన నుంచి ఒక్కరికీ అవకాశం ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి ఊకలో ఈకలా మారిందన్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పదవి ఆశించిన టీడీపీ నేతలకు భంగపాటు తప్పలేదు. మొత్తం మీద తాంబూలాలిచ్చాం.. తన్నుకు చావండి అన్నట్టుగా పరిస్థితి తయారైందని కూటమి నేతలే పెదవి విరుస్తున్నారు.



- కార్పొరేషన్ పదవుల పందేరంపై కూటమి నేతలు గుస్సా
- నామినేటెడ్ పోస్టు దక్కుతుందని ఆశించిన వారికి నిరాశ
- ఊకలో ఈకలా జనసేన నాయకుల పరిస్థితి
- టీడీపీ నాయకులకే పదవులు కట్టబెట్టడంపై భగ్గుభగ్గు
- పదవుల పంపకంలో దామచర్ల జనార్దన్ వ్యతిరేకులకు పెద్ద పీట
- దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు రిక్త హస్తం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

వంద రోజుల పడిగాపుల తరువాత ఎట్టకేలకు కార్పొరేషన్ చైర్మన్‌లను నియమిస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 కార్పొరేషన్లను భర్తీ చేయగా జిల్లాలో కేవలం ఇద్దరికి మాత్రమే పదవులు ఇచ్చారు. అదికూడా కేవలం తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులకే పదవులు ఇవ్వడం జనసేన నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి జనసేన నాయకులకు ప్రాధాన్యత కలిగిన పదవులు లభిస్తాయిని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌కు, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణకు అత్యంత కీలకమైన పదవులు వస్తాయని, వీరికి పదవులు సైతం కన్ఫార్మ్ అయ్యాయని, రేపోమాపో ప్రకటించడం మాత్రమే మిగిలి ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో ఊదరగొట్టేశారు. అయితే మంగళవారం ప్రాధాన్యత కలిగిన కార్పొరేషన్ చైర్మన్ల పదవులు భర్తీ అయ్యాయి. ఇందులో అధికార టీడీపీకి చెందిన ఇద్దరికి మాత్రమే పదవులు దక్కాయి. మిగిలిన వారికి మొండిచేయే మిగిలింది.

జనార్దన్ వ్యతిరేకులకు పెద్దపీట..

నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో దామచర్ల జనార్దన్‌కు చుక్కెదురైంది. పదవులు దక్కిన ఇద్దరూ జనార్దన్‌కు వ్యతిరేకులుగా ఉన్నారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూకసాని బాలాజీ, ఆంధ్రప్రదేశ్ పోర్టులు, హార్బర్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా దామచర్ల సత్యను నియమించారు. ప్రస్తుతానికి ఈ ఇద్దరికి మాత్రమే పదవులు దక్కాయి. సీఎం చంద్రబాబు ప్రకటించిన కార్పొరేషన్ చైర్మన్ల లిస్టు చూస్తుంటే దామచర్ల ఇచ్చిన లిస్టును ప్రస్తుతానికి పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. వాస్తవానికి నూకసానికి, దామచర్లకు మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. ఈ విభేదాల నేపథ్యంలోనే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒంగోలులో తెలుగుదేశం పార్టీకి రెండు కార్యాలయాలు ఉన్నాయి. ఎన్నికల్లో సైతం నూకసానిని దగ్గరకు రానివ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రకటించిన కార్పొరేషన్ పదవులు తొలి లిస్టులోనే నూకసాని పేరు ఉండడం దామచర్ల జీర్ణించుకోలేకపోతున్నారని తెలుస్తోంది. అలాగని సోదరుడి వరసైన దామచర్ల సత్యతో కూడా జనార్దన్‌కు పూర్తిగా సఖ్యత లేదు. ఆయనకు కూడా ఇప్పుడు పదవి లభించింది. ఈ ఇద్దరి పేర్లూ జనార్దన్ ఇచ్చిన లిస్టులో లేవని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌కు కార్పొరేషన్ పదవి ఇప్పిస్తానని జనార్దన్ హామీ ఇచ్చారని ప్రచారం జరిగింది. రియాజ్ సైతం ఆయన్నే నమ్ముకుని ఉన్నారు. చివరకు చంద్రబాబు ప్రకటించిన జాబితాలో లేకపోవడం నిరాశకు గురైనట్టు తెలుస్తోంది.

సత్య పదవిపై విమర్శలు...

పోర్టులు, హార్బర్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా దామచర్ల సత్యను నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఎన్నికలకు ముందు బ్రెజిల్ నుంచి విశాఖ తీరానికి వచ్చిన కంటైనర్‌లో 25 వేల కేజీల డ్రగ్స్ పట్టుబడడం తెలిసిందే. ఇంటర్‌పోల్ సమాచారంతో రంగంలోకి దిగిన సీబీఐ ఈ కంటైనర్లను పట్టుకుంది. ఈ కంటైనర్లు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ పేరుతో బుకింగ్ అయినట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఈ సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టు లిమిటెడ్‌కు దామచర్ల సత్యకు సంబంధాలు ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.

ఇప్పుడు ఎన్నికలైపోయి మూడు నెలలు కావస్తున్నా ఈ కంటైనర్ల వ్యవహారం ఏమైందో తెలియదు. కానీ డ్రగ్స్‌తో పట్టుబడిన కంటైనర్‌ను బుక్ చేసిన సంధ్యా కంపెనీతో సంబంధాలు ఉన్నట్లు ప్రచారం జరిగిన దామచర్ల సత్యను అదే పోర్టులు, హార్బర్ల కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించడం గమనార్హం.

లక్ష్మి, ఎరిక్షన్ సంగతేంటి...?

గత ఎన్నికల్లో దర్శి నుంచి పోటీ చేసి ఓటమి పాలైన గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి ఓటమి పాలైన గూడూరి ఎరిక్షన్ బాబుకు కార్పొరేషన్ పదవులు దక్కుతాయని ప్రచారం జరిగింది. ఎన్నికల్లో ప్రజల తిరస్కారానికి గురైన వీరిని అదే నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా నియమించారు. దర్శిలో టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న లక్ష్మి ప్రజా ప్రతినిధి కాకపోయినప్పటికీ అధికారులపై పెత్తనం చెలాయిస్తూ వస్తున్నారు. ఏకంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారుల కుర్చీల్లో ఆశీనులు కావడంపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈమెకు రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి దక్కుతుందని ఎల్లో మీడియా సైతం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. గొట్టిపాటి లక్ష్మి దూకుడుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న తరుణంలో ఆమెకు కార్పొరేషన్ పదవి ఇచ్చేందుకు తటాపటాయిస్తున్నట్లు సమాచారం. అలాగే యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు కూడా ఆ నియోజకవర్గంలో దొడ్డిదారిన అధికార దర్పాన్ని చూపుతున్నారు. ఈ క్రమంలో అధికారిక ప్రొటోకాల్ వర్తించేలా ఏదైనా కార్పొరేషన్ పదవి ఇవ్వాలని వారు కోరుతున్నారు. చంద్రబాబు కూడా ఇందుకు అంగీకారం తెలిపినట్లు ప్రచారం జరిగింది. ఈ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు తీవ్రతరమయ్యాయి. డా.రవీంద్ర వర్గానికి చెందిన నాయకుడొకరు మురారిపల్లెలో ఉచితంగా మంచినీరు పంపిణీ చేస్తున్నారు. అది సహించలేని ఎరిక్షన్ బాబు సూచనతో అదే పార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మంచినీటి ట్యాంకర్‌లో పురుగుల మందు కలిపారు. ఈ విషయం జిల్లాలో కలకలం రేపింది. ఈ విషయాన్ని రవీంద్ర వర్గం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఎరిక్షన్ బాబుకు కూడా కార్పొరేషన్ పదవి ఇవ్వడానికి సంకోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఈ ఇద్దరు నాయకులు పదవులు దక్కకపోవడంతో నిరుత్సాహానికి గురైనట్లు సమాచారం.

మా కారు ఎక్కండి...

- కలెక్టర్‌ను కోరిన స్థానిక ఎమ్మెల్యే దామచర్ల
- సున్నితంగా తిరస్కరించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు అర్బన్: సాధారణ విషయాలు మాట్లాడేందుకు కలెక్టర్ కార్యాలయానికి స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు మంగళవారం వచ్చి కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూడా సాధారణ విషయాలు చర్చించేందుకు వచ్చామని దామచర్ల తెలిపారు. అయితే కలెక్టరేట్ నుంచి నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెళ్లేందుకు అప్పుడే కలెక్టర్ కూడా కారు వద్దకు వచ్చారు. దీంతో దామచర్ల తాను మున్సిపల్ కార్యాలయానికి వెళ్తున్నానని కలిసి వెళ్లేందుకు తన కారు ఎక్కాలని పదేపదే కలెక్టర్‌ను కోరారు. దీంతో కలెక్టర్ ఎమ్మెల్యే కారు ఎక్కబోయి కూడా వెనక్కు వెళ్లిపోయారు. మళ్లీ ఎమ్మెల్యే తన కారు ఎక్కాలంటూ కోరడంతో కలెక్టర్ సున్నితంగా తిరస్కరించి తన కారులో మున్సిపల్ కార్పొరేషన్‌కు బయలు దేరారు. జరిగిన సంఘటనను అక్కడే ఉన్న కూటమి నాయకులు, అధికారులు ఆసక్తిగా గమనించారు.

ఇద్దరు టీడీపీ నేతలకు రాష్ట్ర పదవులు

- మారిటైమ్ బోర్డు చైర్మన్‌గా దామచర్ల సత్య, టూరిజం డెవలెప్‌మెంట్ బోర్డుకు నూకసాని

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ఇద్దరు టీడీపీ నేతలకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులను కేటాయించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలు ఉన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యను మారిటైమ్ బోర్డు చైర్మన్‌గా, జెడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా నియమించారు.

29న గిరిజన ఉద్యోగుల సంఘ డైమండ్ జూబ్లీ సంబరాలు

ఒంగోలు సెంట్రల్: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకుడు డాక్టర్ బాలాజీ నాయక్ తెలిపారు. సంఘం ఏర్పాటుకు అనేక మంది అహర్నిశలు శ్రమించి కష్టనష్టాలు అనుభవించారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అయినా గిరిజన జీవితాల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ గుర్తు చేస్తూ జూబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్లు చెప్పారు. సంఘ నాయకులు, బాధ్యులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న గ్రామ సచివాలయ మహిళా పోలీసులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: గ్రామ సచివాలయ మహిళా పోలీసుల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని పోలీసు కళ్యాణ మండపంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జిల్లా వ్యాప్తంగా మొత్తం 51 మంది మహిళా పోలీసులకు కౌన్సెలింగ్ ప్రక్రియ వివరించారు. వారి స్వగ్రామాల్లో కాకుండా ఇతర గ్రామాల్లోని సచివాలయాల్లో ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్‌పై ప్రదర్శించారు. ర్యాంక్, ఖాళీల ప్రకారం కోరుకున్న చోటుకి బదిలీ చేశారు. కొంతమంది యథాస్థానంలో కొనసాగేందుకు సుముఖత వ్యక్తం చేయడంతో వారిని అదే పోస్టుల్లో కొనసాగించారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి: ఎస్పీ ఏఆర్ దామోదర్

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నేర నియంత్రణలో మహిళా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతలో తమ వంతు కృషి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్ తదితర విషయాల మీద నిఘా పెట్టి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలని చెప్పారు. స్కూళ్లు, కళాశాలల విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి లాంటి డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించి చెప్పాలన్నారు. ఫేక్‌లోన్స్, ఓటీపీ మోసాలు, ఇతర సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 28వ తేదీ ఏర్పాటు చేయనున్న ఉచిత మెడికల్ క్యాంపును మహిళా పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఓ యం.సులోచన, ఏఏఓ ఉస్మాన్ బాష, ఏ సూపరింటెండెంట్ డి.శైలజ, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, పోలీసు యూనిట్ డాక్టర్ భానుమతి, ఆర్ఐలు రమణారెడ్డి, రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వం కోసం కృషి చేయాలి

- డీబీఆర్‌సీ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎం.హేమలత



మాట్లాడుతున్న డీబీఆర్‌సీ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం.హేమలత

ఒంగోలు: స్త్రీ, పురుష సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎం.హేమలత పిలుపునిచ్చారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఒంగోలులోని సినార్డ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్త్రీ- పురుష సమానత్వంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ లింగ సమానత్వం మానవ హక్కు అని, మహిళలు తమ భయాన్ని వీడి గౌరవంగా, స్వేచ్ఛగా జీవించేందుకు అర్హులుగా పేర్కొన్నారు. సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.జ్యోతి సుప్రియ మాట్లాడుతూ పలు రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలకు సైతం సమానత్వం దక్కడం లేదన్నారు. బాలల సంక్షేమ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ వేము రామాంజనేయులు మాట్లాడుతూ ఆడ, మగ పిల్లలను సమానంగా చూడటంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, ఇద్దరికీ విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సమానమైన అవకాశాలు కల్పించాలన్నారు. డీబీఆర్‌సీ రాష్ట్ర ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వీఎస్‌వీ భాస్కర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి కొన్ని శతాబ్దాలు గడిచినా స్త్రీల పట్ల అవమానాలు, హత్య, దోపిడీలు జరుగుతుండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఏలియా, జయరాజ్, రవిచంద్ర, డీబీఆర్‌సీ ఒంగోలు సిటీ, దర్శి ఏరియా కోఆర్డినేటర్లు గుంటూరు నాగమణి, గుత్తి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో నాయకత్వ లక్షణాలు

- ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ మూర్తి



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ డాక్టర్ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల్లో పాల్గొనడం, నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. స్థానిక ఏకేయూ సెమినార్ హాల్లో మంగళవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ కొన్ని దేశాల్లో యుద్ధ సమయంలో అవసరమైతే సైనికులకు సహాయకారులుగా పని చేసేందుకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను కూడా వినియోగించుకుంటారన్నారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిధిలో ప్రస్తుతం 58 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయని, వీటి ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించుకోగలుగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24వ తేదీని జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుతారన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి, పచ్చదనం-పరిశుభ్రత పనులు చేపట్టడం, మొక్కల పెంపకం వంటి పనులను చేపట్టడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందుతుందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మండే.హర్షప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. గతంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఒంగోలు పీజీ సెంటర్ ఉన్నప్పుడు ఒంగోలు నగర పరిధిలో ఉన్న ప్రగతి కాలనీ, బాలాజీ నగర్ ప్రాంతాలను దత్తత తీసుకుని ఆయా ప్రాంతాల అభివృద్ధికి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంతగానో కృషి చేశారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, డి.ఓ.ఏ.డాక్టర్ సోమ శేఖర మాట్లాడారు.

కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఇన్చార్జి డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సోషల్ వర్క్ విభాగం హెచ్.ఓ.డి.డాక్టర్ పిల్లి.వెంకటరావు తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఏ.కే.యూ.కళాశాల విద్యార్థులు, నగరం లోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల, జి.ఆర్.కే.డిగ్రీ కళాశాల, శ్రీ నాగార్జున డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి యాగం

- నగరంలో అమ్మవారి మహా రథయాత్ర



రథయాత్రలో వారాహి అమ్మవారి ఉత్సవమూర్తి

ఒంగోలు మెట్రో: వారాహి ఉపాసకుడు మహారుద్ర స్వామి నేతృత్వంలో వారాహి మహా రథయాత్ర తిరుపతి నుంచి బయలుదేరి విశాఖపట్నం వెళ్లే దారిలో ఒంగోలు నగరంలో నుంచి యాత్ర సాగింది. స్థానిక భక్తులు దాసరి నరసింహారావు, కరణం రమాదేవి, కొక్కిరాల సంజీవకుమార్, తంజావూరి శ్రీనివాసమూర్తి, పాలెం సురేష్ బాబు, కోనూరు రంగారావు నేరెళ్ల శ్రీనివాసరావు, మువ్వల నాగరాజు పర్యవేక్షణలో మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు వారాహి యాగాన్ని నిర్వహించారు. సాయితేజా రెడ్డి యాగ పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు పురవీధుల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన రథంపై అమ్మవారిని ప్రతిష్ఠింపజేసి ఊరేగించారు. కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద శ్రీ సిద్ధి వినాయక దేవస్థానం నుంచి బయలుదేరిన అమ్మవారి రథం స్థానిక సంతపేటలోని టీటీడీ కళ్యాణ మండపం వరకు సాగింది. రథయాత్రలో మహిళా భక్తుల కోలాటం ఆకట్టుకుంది.



రథయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

క్లుప్తంగా

జూదరుల నుంచి రూ.48,500 స్వాధీనం

పీసీపల్లి: పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన పెద్ద చర్లపల్లి జి. లింగన్నపాలెంలో జరిగింది. మంగళవారం అందిన సమాచారం మేరకు పెద్ద చెర్లోపల్లి మండలంలోని జి. లింగన్నపాలెం గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.48,500 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యక్తుల సమాచారాన్ని ఎవరైనా ఇస్తే.. వారి వివరాలు బయటకు రాకుండా ఆ అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొన్న వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

1 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

బేస్తవారిపేట: స్థానిక సాయిబాబా టెంపుల్ గ్రౌండ్‌లో హరి ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి, రెండో, మూడో బహుమతులుగా వరుసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.30 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జట్లు ఈ నెల 30వ తేదీలోగా రూ.2500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. వివరాలకు 8977553431, 8105934660ను సంప్రదించాలని సూచించారు.

కార్మిక పోరాటాల్లో పీవీఆర్ పాత్ర కీలకం



పీవీఆర్ చౌదరి సంతాప సభలో ప్రసంగిస్తున్న రావులపల్లి రవీంద్రనాథ్

ఒంగోలు టౌన్: నగరంలో కార్మిక సంఘాల ఏర్పాటుతో పాటు, పోరాటాల్లో పీవీఆర్ చౌదరి కీలకపాత్ర పోషించారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. నగరంలోని అద్దంకి బస్టాండు సెంటర్‌లో మంగళవారం పీవీఆర్ చౌదరి సంతాప సభ నిర్వహించారు. రావులపల్లి ప్రసంగిస్తూ చౌదరి చనిపోయే ముందు కూడా విజయవాడ వరద బాధితులకు రూ. 5 లక్షల విలువైన నిత్యావసరాలను సేకరించి పంపిణీ చేసి వచ్చారని తెలిపారు. ముఠా కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, విద్యార్థుల సమస్యలపై జరిగిన ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. సంతాప సభలో డీహెచ్‌పీ ఎస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, కొత్తకోట వెంకటేశ్వరరావు, ఎంఏ సాలార్, వడ్డపాటి సుబ్బారావు, చెక్క రాధకృష్ణ మూర్తి, దేసు వెంకటేశ్వర్లు, బియ్యపు వరదరాజు పాల్గొన్నారు.


అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● రూ.3.41 లక్షల సొత్తు స్వాధీనం

అద్దంకి: పలు దేవస్థానాల్లో, ఎవరూ లేని ఇళ్లల్లో చోరీలు చేసే దొంగను పట్టుకొని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని కొంగపాడు డొంక వద్ద సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణయ్య చెప్పారు. సీఐ వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామానికి చెందిన తన్నీరు మధు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. చెడు వ్యసనాలకు బానిసైన ముద్దాయి, కూలి పనులతో వచ్చే డబ్బు సరిపోక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. దాదాపు 20 ఏళ్ల నుంచి పలు దేవస్థానాల్లో ఎవరూ లేని రాత్రి సమయాల్లో, ఇళ్లల్లో దొంగతనాలు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఆయా స్టేషన్లలో ముద్దాయిపై కేసులు నమోదయ్యాయి. ముద్దాయి వద్ద నుంచి ఒక ట్రాక్టర్ ట్రాలీ, కిలన్ పట్టాలు ఐదు, గ్రీజ్ గన్ ఒకటి, కంప్రెషర్ డ్రిల్లర్లు రెండు, రెండు రౌండ్ల స్టే వైరు, మూడు గడ్డపారలు, ఆంజనేయ స్వామి గంట, పంచహారతి, కర్పూర గరిటె, ఆఫీస్ టేబుల్, ప్లాస్టిక్ చైర్స్, తారు పట్ట, చార్జింగ్ లైటు, వైరు కట్ట, ప్లాస్టిక్ డబ్బాలు, ఫ్యాన్లు రెండు, చలగపారలు రెండు, బైకులు రెండు, యాంప్లిఫైర్, మోత్‌లకు సంబంధించి రూ.3.41 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

తమ సిఫార్సుల మేరకే బదిలీ చేయాలంటూ మంత్రులు, ఎమ్మెల్యేల మంకుపట్టు

● రెండు రోజులుగా జిల్లా పరిషత్‌లో మంత్రులు, ఎమ్మెల్యేల పీఏల హల్‌చల్
● సాధారణ బదిలీలపై 21వ తేదీన సంతకం చేసిన జెడ్పీ చైర్‌పర్సన్
● గడువు ముగిసినా వెలువడని బదిలీ ఉత్తర్వులు
● రాజకీయ తొత్తుల్లా వ్యవహరిస్తున్నారని జెడ్పీ ఉన్నతాధికారులపై ఉద్యోగుల ఆగ్రహం



జెడ్పీ ఉద్యోగులతో బదిలీలాట!



ఒంగోలులోని జిల్లా పరిషత్ కార్యాలయం

ఒంగోలు సిటీ: జెడ్పీ ఉద్యోగుల సాధారణ బదిలీలలో గందర గోళం నెలకొంది. తాము సిఫార్సు లేఖలు ఇచ్చిన వారికే.. చెప్పిన చోటే పోస్టింగులు ఇవ్వాలంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు జెడ్పీ ఉన్నధికారులకు హుకుం జారీ చేయడంతోపాటు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తుండటంతో సాధారణ బదిలీల ప్రక్రియ కాస్తా నిలిచిపోయింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఉద్యోగుల బదిలీలపై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సంతకం చేసినా ఆ ఫైల్‌ను ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

ఇపుడేమిటి కర్తవ్యం

సాధారణ బదిలీ ప్రక్రియలో భాగంగా జిల్లా పరిషత్ ఉద్యోగులు 392 మందికి స్థాన చలనం కల్పించాల్సి ఉంది. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ 28 మంది, సీనియర్ అసిస్టెంట్లు 52 మంది, జూనియర్ అసిస్టెంట్లు 114 మంది, రికార్డు అసిస్టెంట్లు 100 మంది, టైపిస్టులు 24 మంది, అటెండర్లు 59 మంది, ఎంపీడీఓలు 15 మంది.. వెరసి మొత్తం 392 మంది ఉన్నారు. వీరి బదిలీలకు సంబంధించి ఈ నెల 22వ తేదీన ఉత్తర్వులు జారీ చేయాలి. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు అందుకున్న ఉద్యోగులంతా 23వ తేదీన బదిలీ అయిన ప్రాంతంలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. అయితే సాఫీగా సాగాల్సిన బదిలీ ప్రక్రియ కాస్తా మంత్రులు, ఎమ్మెల్యేలు వేలు పెట్టడంతో ముందుకు సాగడం లేదు. తమ వారికే పోస్టింగులు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తుండటంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. తమ పరిస్థితి ముందర కాళ్లకు బంధ మేసినట్లుగా ఉందని గగ్గోలు పెడుతున్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు హల్‌చల్

గత రెండు రోజుల నుంచి మంత్రులు, జిల్లాలోని ఎమ్మెల్యేల పీఏలు జిల్లా పరిషత్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు 23వ తేదీ సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి తమ వారికే పోస్టింగులు ఇవ్వాలని డిప్యూటీ సీఈఓతో మంతనాలు జరిపారు. కేబినెట్ హోదా కలిగిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆమోదించిన బదిలీల జాబితాను సైతం మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు వ్యక్తిగతంగా జెడ్పీ కార్యాలయంలో డిప్యూటీ జెడ్పీ సీఈఓ హనుమంతరావు గదిలో కూర్చుని పరిశీలించడం గమనార్హం. ఈ నేపథ్యంలో కొందరు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జెడ్పీ చైర్‌పర్సన్ సంతకం చేసినా పెండింగ్

జిల్లా పరిషత్ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియకు సంబంధించిన ఫైల్‌పై జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఈ నెల 21వ తేదీ శనివారం సంతకం చేసి అప్రూవల్ ఇచ్చారు. జెడ్పీ అధికారులు 22వ తేదీ ఉత్తర్వులు ఇచ్చినట్లయితే 23వ తేదీ జాయిన్ అయి ఉండేవారు. అయితే తమ పంతం నెగ్గించుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర మంత్రులు, అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు బదిలీల ఫైల్‌కు మోకాలడ్డారు. స్వామి భక్తిని చాటుకునేందుకు అవకాశం దక్కిందన్న సంతోషంలో కొందరు జెడ్పీ అధికారులు.. రాజకీయ తొత్తులుగా మారి బదిలీల ప్రక్రియకు బ్రేకులు వేసినట్లు ఉద్యోగుల్లోనే తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది. బదీలలకు సంబంధించి గడువు ముగినప్పటికీ జెడ్పీ అధికారులు ఇంకా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. బదిలీల ప్రక్రియ సాగదీతలపై వివరణ కోరేందుకు ప్రయత్నించినా జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు స్పందించలేదు.

హత్య కేసులో యావజ్జీవ శిక్ష

ఒంగోలు: హత్య కేసులో నిందితునికి యావజ్జీవ ఖైదు విధిస్తూ 8వ అదనపు న్యాయమూర్తి ఎ.అమ్మన్న రాజా మంగళవారం తీర్పునిచ్చారు. మువ్వల వెంకట సుబ్బారావు అనే అతనిని రమావత్ యేసు నాయక్ అనే వ్యక్తి హత్య చేసినట్లు 2016లో సంతనూతలపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. స్థానిక బాలాజీ రావుపేటకు చెందిన మువ్వల వెంకట సుబ్బారావు అలియాస్ సుబ్బు (43) మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతనికి లైంగిక కోర్కెలు తీర్చుకునేందుకు గాను కాల్ గరల్స్‌ను గుంటూరు జిల్లా నకరికల్ మండలం బాలాజీనగర్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ రమావత్ యేసు నాయక్ ఏర్పాటు చేసేవాడు. ఆటోడ్రైవర్‌గా ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవాడు. 2016 డిసెంబర్ 3న మువ్వల వెంకట సుబ్బారావుకు ఒక వ్యక్తి రూ. 50వేలు ఇవ్వడం గమనించాడు. దీంతో ఎలాగైనా ఆ డబ్బు పొందాలనే దురుద్దేశంతో నిందితుడు పక్కా ప్లాన్ వేసి కాల్ గరల్స్ ఉన్నారు రమ్మంటూ వెంకట సుబ్బారావుకు ఫోన్ చేశాడు. ఈ నేపథ్యంలో ముందుగానే స్థానిక టిప్‌టాప్ బజారులో పెద్ద కత్తి, టీషర్టు కొనుగోలు చేసి 2 లీటర్ల పెట్రోలును బాటిల్‌లో నింపుకుని మంగమూరు డొంకలో ఉన్న సుబాబుల్ తోట వద్దకు చేరుకున్నాడు. రాత్రి 10 గంటల సమయంలో మువ్వల వెంకట సుబ్బారావు సుబాబుల్ తోట వద్దకు చేరుకున్న వెంటనే కత్తితో దాడిచేసి ఛాతీ, తల, భుజం, పొట్ట తదితర భాగాలపై విచక్షణారహితంగా పొడిచి హత్యచేశారు. అనంతరం 3 సెల్‌ఫోన్లు, షాపు తాళాలు, ఏటీఎం కార్డు, మనీ పర్సు, సిమ్ కార్డులు తీసుకుని మృతుని శరీరంపై పెట్రోలు పోసి నిప్పంటించి అక్కడ నుంచి జారుకున్నారు. సంతనూతలపాడు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు రమావత్ యేసు నాయక్‌గా గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితునికి యావజ్జీవ శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ ఒకటో అదనపు జిల్లా ఇన్‌చార్జి, 8వ అదనపు జిల్లా జడ్జి ఎ.అమ్మన్నరాజా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జలా జోస్ఫిన్, ఇన్వెస్టిగేషన్ అధికారిగా ఎం.మురళీకృష్ణ, లైజన్ ఆఫీసర్లుగా పి.శ్రీనివాసరావు వ్యవహరించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరచడంలో కోర్టు కానిస్టేబుళ్లు కె.వెంకట్రావు కృషి చేశారు.

నల్లమల ఘాట్‌లో ఉల్లిపాయల లారీ బోల్తా

● 4 గంటలకుపైగా స్తంభించిన ట్రాఫిక్

గిద్దలూరు రూరల్: నల్లమల ఘాట్ రోడ్డులో ఉల్లిపాయల లోడ్ బోల్తా కొట్టింది. మంగళవారం తెల్లవారుజామున గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట అటవీ ప్రాంతంలో పాత రైల్వే బ్రిడ్జి మలుపు వద్ద ఈ ప్రమాదం సంభవించింది. వివరాలు.. నంద్యాల నుంచి ఉల్లిపాయల లోడుతో గుంటూరుకు వెళ్తున్న లారీ భారీ మలుపు వద్ద ప్రమాదవశాత్తు బోల్తాపడింది. లారీ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో నంద్యాల నుంచి గిద్దలూరు వైపు, గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. సుమారు 4 గంటల సమయం ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న గిద్దలూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీని పక్కకు తొలగించేందుకు తీవ్రంగా శ్రమించారు. ఉదయం 10.30 గంటలకు ట్రాఫిక్‌ను పునరుద్ధరించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రోడ్డుకు అడ్డంగా పడిన లారీ

పొగాకు ఆరోగ్యానికి హానికరం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి
● పొగాకు విరమణ కేంద్రం ప్రారంభం

ఒంగోలు టౌన్: పొగాకు వినియోగించడం వల్ల ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పొగాకు విరమణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0లో భాగంగా నేషన్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు పొగాకు విరమణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. పొగాకు అలవాటును మాన్పించడం చాలా కష్టమైన పని అయినప్పటికీ వివిధ పద్ధతుల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. ప్రత్యామ్నాయ నికోటిన్ ఇవ్వడం ద్వారా టుబాకో అడిక్షన్ నుంచి బయట పడేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రంలో సైకియాట్రిక్ విభాగంలో ఎంతో అనుభవజ్ఞులైన సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. పొగాకు అలవాటు మానుకోవాలని భావిస్తున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని కోరారు. కార్యక్రమంలో సైకియాట్రిక్ విభాగానికి చెందిన వైద్యులు ఐఎల్ లక్ష్మీనారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర సాగర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ పూజిత పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో పొగాకు నివారణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ దుర్గాదేవి

రబీ పూర్తయ్యే వరకు రైతులతో కలిసి పనిచేస్తాం

● వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు: రబీ సీజన్ పూర్తయ్యే వరకూ వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు ఇకపై మంగళ, బుధవారాల్లో గ్రామాల్లో రైతాంగంతో కలిసి పనిచేసి మేలైన పంట ఉత్పత్తులు సాధించేందుకు కృషి చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మద్దిరాలపాడులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పంట ఉత్పత్తుల్లో మేలైన విధంగా దిగుబడి వచ్చేలా శాస్త్రవేత్తల పర్యవేక్షణ నిరంతరం ఉంటుందన్నారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శనగ పంటలో విత్తనశుద్ధి చేసుకుంటే ఎండు తెగులు రాకుండా నివారించుకోవచ్చన్నారు. ఒంగోలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ–పంట నమోదు చేసుకుంటే రైతులు వారు సాగు చేసిన పంటలకు బీమా పొందొచ్చన్నారు. ఉద్యానవన శాఖ అధికారి ప్రత్యూష మాట్లాడుతూ రైతులకు 40 శాతం రాయితీపై పండ్ల మొక్కలు ఎరువులు అందజేస్తామని తెలిపారు. పశు సంవర్ధకశాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ మినీ గోకులాలు 90 శాతం రాయితీ మీద అందజేస్తామని తెలిపారు. సంపూర్ణ మిశ్రమ దాణాను సబ్సిడీ కింద కిలో రూ.6.50 అందజేస్తామని తెలిపారు. కెనరా బ్యాంక్ ఫీల్డు ఆఫీసర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు వేసే రైతులకు బ్యారన్‌కు ఏడు లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఏవో వెంకట్రావు, సర్పంచ్ స్వర్ణ అనూరాధ, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు

రఘురామరాజును శిక్షించాలి

ఒంగోలు టౌన్: ఒక వీధి రౌడీ మాదిరిగా ప్రవర్తిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఫ్లెక్సీలు చించి దళితుల మనోభావాలను దెబ్బతీసిన రఘురామరాజుకు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని స్పష్టం చేశారు. అతడిని పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని, అట్రాసిటీ కేసు నమోదు చేయకపోతే రాష్ట్ర మాల మహానాడు తరఫున న్యాయస్థానంలో పిల్ వేస్తామని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద నకిలీ డ్యాక్యుమెంట్లు పెట్టి 947 కోట్ల రుపాయల అప్పులు తీసుకొని మోసానికి పాల్పడిన రఘురామరాజు బతుకు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలిసిందేనన్నారు. రాజకీయ లబ్ధికోసం గత 9 ఏళ్లలో ఐదు రాజకీయ పార్టీలు మారిన అతడికి ఎలాంటి విలువలు లేవని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బత్తుల వెంకటరావు, సుబ్బయ్య, శశి కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య

జాతీయ స్థాయి లాక్రోస్ పోటీలకు పేస్ విద్యార్థిని



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పేస్ విద్యార్థిని ఫాతిమా

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుతున్న ఎస్కే ఫాతిమా జాతీయస్థాయి లాక్రోస్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి మంగళవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఆగస్టు 31, ఈనెల 1 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రకాశం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఈనెల 26 నుంచి 30 వరకు ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక కావడం, ఆమె తమ కాలేజీ విద్యార్థిని కావడంపై సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.10 వేలు ప్రోత్సాహకంగా అందించారు. కార్యక్రమంలో పేస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.వీ.కే. మూర్తి, డీన్ ఆఫ్ అకాడమీ డాక్టర్ సి.వి.సుబ్బారావు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు, ప్రథమ సంవత్సర డీన్ డాక్టర్ సుబ్బారావు మరియు విభాగాధిపతులు రవీంద్ర, ఎస్కే షరీఫ్, ఫిజికల్ డైరెక్టర్స్ ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.

బహుముఖ ప్రయోజనకారిగా పరేడ్ గ్రౌండ్

● ఎస్పీ ఏఆర్ దామోదర్



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను బహుముఖ ప్రయోజనకారిగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. మంగళవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలిచ్చారు. పరేడ్స్, డ్రిల్స్, వేడుకలు, స్పోర్ట్స్, పోలీస్ ఈవెంట్స్‌కు ఉపయోగపడేలా మైదానాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు. గ్రౌండ్‌మెన్‌తో నిత్యం వాటరింగ్ చేయడం, గడ్డి తొలగించడం, గుంతలు పూడ్చటంతోపాటు పరిశుభ్రంగా ఉంచడం లాంటి చర్యలు చేపట్టాలని సూచించారు. రిజర్వ్ సిబ్బందిలో క్రమశిక్షణ, సమన్వయం కోసం తరచూ పరేడ్, క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా సాయుధ దళాల సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎస్పీ పేర్కొన్నారు. పాత పోలీస్ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఎస్పీ వెంట ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, రమేష్ కృష్ణన్ ఉన్నారు.

బాలినేని ఫ్లెక్సీ చించివేత



లాయరు పేటలో ఏర్పాటు చేసిన బాలినేని ఫ్లెక్సీని చించివేసిన దృశ్యం

● ఇటీవల చర్చి సెంటర్ వద్ద ఒక ఫ్లెక్సీ తొలగింపు

ఒంగోలు టౌన్: ఒంగోలులో ఫ్లెక్సీల రగడ కొనసాగుతోంది. మొన్న చర్చి సెంటర్‌లో బాలినేని అభిమానులు వేసిన ఫ్లెక్సీ చిచ్చు రాజేయగా.. మంగళవారం లాయరు పేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చించివేయడం సంచలనం రేపింది. నగరంలోని లాయరు పేట సాయిబాబా గుడి సమీపంలో పాత వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జనసేన పార్టీ పేరుతో మంగళవారం ఓ రిబ్బన్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో ఇటీవల పవన్ కళ్యాణ్‌ను కలిసిన బాలినేని ఫొటోతో పాటు ప్రధాన మంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోలు కూడా ముద్రించారు. అయితే ఉదయం ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీని సాయంత్రానికల్లా చించివేశారు. పట్టపగలే ఇలా చేసినవారిని గుర్తించాల్సి ఉంది. గత శుక్రవారం రాత్రి నగరంలోని చర్చి సెంటర్ వద్ద బాలినేనిని జనసేనలోకి ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తెలుగు దేశం నాయకులు మున్సిపల్ సిబ్బంది సాయంతో తొలగించడం తెలిసిందే. ఈ ఫ్లెక్సీ తొలగింపు పెద్ద దుమారమే రేపింది. అందులో తాజా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫొటో వేయడాన్ని వ్యతిరేకించిన తెలుగు యువత నాయకుడు ముత్తన శ్రీనివాసరావు మరోసారి ఇలాంటి ఫ్లెక్సీలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అయితే మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో దామచర్ల జనార్దన్ ఫొటో లేదు కానీ.. చంద్రబాబు ఫొటో మాత్రం ముద్రించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఒన్‌టౌన్ సీఐ వై.నాగరాజు తెలిపారు.